

అప్పుడు హద్దుల్లేకుండా.. ఇప్పుడు అజ్ఞాతంలోకి..

- అరాచక వైసీపీ సోషల్‌మీడియా బ్యాచ్‌పై కూటమి ప్రభుత్వం దృష్టి
- అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై చర్యలు
- జిల్లావ్యాప్తంగా 13 కేసులు నమోదు
- కొత్త చట్టాలతో మరింత కఠిన శిక్ష

వైసీపీ హయాంలో వారు మనుషులన్న సంగతే మరిచిపోయారు. తమ అధినేత మెప్పు కోసం ప్రత్యర్థులపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లూ టీడీపీ, జనసేన నాయకులను, మహిళలను సైతం వారి వ్యక్తిత్వ హననాన్ని హరించేలా కించపరుస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టి 'సైకో' ఆనందం పొందారు. ఇటువంటి వారి భరతం పట్టేందుకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సోషల్ మీడియాలో ఎవరినైనా కించపరిస్తే వారిపై ఉక్కుపాదం మోపుతోంది. ఇన్నాళ్లు మౌనం దాల్చిన పోలీసులు.. ఇప్పుడు పాతపోస్టులను తవ్వి తీస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో అప్పట్లో హద్దుమీరిన 'సైకో' బ్యాచ్ సభ్యులు.. ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు.

శ్రీకాకుళం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టేవారిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో గత ఐదేళ్లు ప్రత్యర్థులే లక్ష్యంగా టీడీపీ, జనసేన శ్రేణులపై ఇష్టానుసారంగా అసభ్యకర పోస్టులు పెట్టే వైసీపీ సోషల్ మీడియా బృందాల్లో అలజడి రేగుతోంది. ఎక్కడ తమపై కేసులు నమోదు చేస్తారేమోనన్న భయంతో చాలామంది అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ సానుభూతిపరులు, మరికొందరు ఉన్మాదుల్లా వ్యవహరించి కేవలం కొంతమంది ప్రత్యర్థుల కుటుంబాలను టార్గెట్ చేశారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో వారి ఇళ్లలో మహిళలను సైతం కించపరిచేలా పోస్టులు పెట్టారు. వీటిని ప్రశ్నించిన, కౌంటర్ పోస్టులు పెట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సానుభూతిపరులను వెంటాడి అరెస్టు చేశారు. వైసీపీ నాయకుల జోలికి మాత్రం పోలీసులు వెళ్లలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొలువుదీరగా.. ఇంకా వైసీపీకి చెందిన సోషల్ మీడియా బృందాలు తీరు మార్చుకోలేదు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతోపాటు మీడియా ప్రతినిధులపై అసభ్యకర పోస్టులు పెడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వాటిల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఇటువంటి పోస్టులపై జిల్లాస్థాయి పోలీసు విభాగం సైబర్ క్రైం టీమ్ సునిశితంగా పరిశీలిస్తోంది. ప్రతి స్టేషన్‌లో వీటిపై ఫిర్యాదులు (మిగతా 6వ పేజీలో..)



అధికంగా పలాసలోనే..

జిల్లాలో అధికంగా పలాస నియోజకవర్గంలో వైసీపీ సోషల్ మీడియా సభ్యులు నీచంగా విమర్శలు చేస్తూ.. ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ మహిళలను కించపరుస్తూ.. అసభ్యకరంగా ట్రోల్ చేసేవారు. నిన్నమొన్నటివరకూ అదేతీరున వ్యవహరించారు. శ్రీకాకుళం, టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో కూడా సైకో బ్యాచ్ పనికట్టుకుని ప్రత్యర్థులను కించపరుస్తూ ట్రోలింగ్ చేసేది. అప్పట్లో పలాసలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలులేవు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో పోలీసులు చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా కొన్ని కేసుల వివరాలను.. వారిపేర్లను వెల్లడించేందుకు పోలీసులు సుముఖత చూపించడంలేదు. చిన్నపాటి తగాదాలు.. భర్త, భార్య కొట్లాట వంటి వివరాలను కేసులు, సెక్షన్‌లతో సహా విలేకర్లకు తెలిపే పోలీసులు.. సోషల్ మీడియా కింద నమోదైన కేసుల వివరాలను వెల్లడించే విషయంలో మీనమేషాలు లెక్కించడం ఆశ్చర్యం కలిగిస్తోంది.



శ్రీకాకుళం కల్చరల్ : కాలభైరవ త్రిపుర సుందరి దేవాలయంలో జ్వాలాతోరణం



జలుమూరు : శ్రీముఖలింగంలో నంది వాహనంపై గ్రామోత్సవం

పరమశివుడు.. జ్యోతి స్వరూపం

6లో

- జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- బాహుదా నది వద్ద భక్తుల దీపారాధన
- నంది వాహనంపై శ్రీముఖలింగేశ్వరుని విహారం

కోటి వత్తులు ఒక్కటిగా చేసి జ్వాలా తోరణం

బిర్సాముండా పోరాటం.. ఆదర్శనీయం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మెళియాపుట్టి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ వలసవాదంపై తిరుగుబాటు చేసిన.. భారత స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గిరిజన జాతికోసం ఆయన చేసిన పోరాటం ఆదర్శనీయమని కొనియాడారు. శుక్రవారం మెళియాపుట్టిలో బిర్సాముండా 150 జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరయోధుడు బిర్సాముండా జయంతిని జన్‌జాతీయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ పాల్గొన్నారని తెలిపారు. వర్చువల్‌గా మెళియాపుట్టిలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. 'గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత అధికంగా ఉంది. పౌష్టికాహారం బాగా తీసుకోవాలి. బాల్యవివాహాలకు దూరంగా ఉండాలి. విద్యాపరంగా అభివృద్ధి చెందాలి. వ్యాపారాల్లో రాణించాలి. వీడీవీకే నిధులతో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని.. ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ చేసుకుంటే మంచి లాభాలు వస్తాయి'అని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఏకలవ్య పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.1.30 కోట్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. 130 మందికి ఆర్‌వోఆర్ పట్టాలను అందజేశారు. ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతు గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మంత్రి అచెన్నను కలిసిన 'సుడా' చైర్మన్

శ్రీకాకుళం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును విజయవాడలో శుక్రవారం 'సుడా' (శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ కొరికాన రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సుడా చైర్మ న్‌గా నియమితులైన ఆయన పలు విషయాలు చర్చించారు. శ్రీకాకుళం నగరాన్ని అభివృద్ధి చేయాలని.. అన్నివిధాలా సహకరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

న్యూస్ బాక్స్

శివాలయంలో.. ఎలుగుబంట్లు

- ఆందోళనలో భక్తులు

హరిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మందస మండలం సువర్ణాపురం శివాలయంలో శుక్రవారం వేకువజామున ఎలుగుబంట్లు సంచరించడంతో భక్తులు ఆందోళన చెందారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని వేకువజామున 4 గంటల సమయంలో భక్తులు ఆలయంలో పూజలు చేస్తున్నారు. ఇంతలో ఆలయంలోని నంది విగ్రహం వద్ద మూడు ఎలుగుబంట్లు కనిపించడంతో భక్తులు భయాందోళనతో కేకలు వేశారు. కొంతమంది లైట్లు వేసి.. కర్రలతో బెదిరించారు. దీంతో అవి సమీప తోటల్లోకి వెళ్లిపోయాయి. ఉద్దానంలో ఇటీవల ఎలుగుల సంచారం ఎక్కువవటంతో ప్రజలు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. రెండేళ్లుగా ఎలుగుల దాడులతో దున్నూరు, ఎర్రముక్కాం, బాతుపురం, చినవంక తదితర గ్రామాల్లో ఎలుగుబంట్లు దాడిలో పదుల సంఖ్యలో గాయపడి మృతిచెందారు. మళ్లీ గ్రామాల్లోకి ఎలుగుబంట్లు వస్తున్నాయని, అటవీ శాఖాధికారులు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



సువర్ణాపురం శివాలయంలో ఎలుగుబంట్లు

లిఫ్ట్ ఇస్తానని నమ్మించి..

- వివాహితపై అత్యాచారయత్నం
- మూడేళ్ల చిన్నారిని గెడ్డలో పడేస్తానని బెదిరింపు
- తప్పించుకుని.. పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- న్యాయం చేస్తారని స్టేషన్‌కు వస్తే రాజీ చేసేందుకు యత్నం
- రూరల్ పోలీసుల తీరుపై ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆగ్రహం
- ఎట్టకేలకు కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఓ వివాహితకు లిఫ్ట్ ఇస్తానని నమ్మించి.. ఓ వ్యక్తి అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ఆ సమయంలో మూడేళ్ల చిన్నారితో ఉన్న ఆమె ఎలాగోలా తప్పించుకుని బయటపడింది. పోలీసులను ఆశ్రయించగా.. రాజీమార్గం కుదిర్చేందుకు యత్నించారు. చివరకు బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేసి.. తమకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు, పోలీసుల వివరాల మేరకు.. శ్రీకాకుళంలోని హయాతీనగరంలో గొల్లవీధికి చెందిన ఓ వివాహిత.. తన భర్త వ్యాపార అవసరాల నిమిత్తం ఈ ఏడాది ఉగాదికి ఓ ఫైనాన్స్ కంపెనీలో ద్విచక్ర వాహనాన్ని తీసుకున్నారు. నెలవారీ వాయిదాల రూపంలో డబ్బులు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా గత నెల వాయిదా సొమ్ము రూ.4,292 చెల్లించలేదు. మరోవైపు అప్పుల భారం భరించలేక వివాహిత భర్త అక్టోబరు 19న ఇంటి నుంచి పరారయ్యాడు. దీంతో వివాహిత (మిగతా 6వ పేజీలో..)

నీటిసంఘాల ఎన్నిక వాయిదా

నరసన్నపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జరగాల్సిన నీటిసంఘాల ఎన్నిక వాయిదా పడినట్లు జిల్లా వంశధార ప్రాజెక్టు అధికారులకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. శాసనసభలో బడ్జెట్ సమావేశాలు అనంతరం ఈనెల 29లోగా నీటిసంఘాలు, డీసీలు, ప్రాజెక్టు చైర్మన్ ఎన్నికల నిర్వహించనున్నారు. వంశధార ప్రాజెక్టు పరిధిలో 54 నీటి సంఘాలు ఉండగా, 9 డీసీలు, ప్రాజెక్టు చైర్మన్ పదవి ఎన్నుకోవాల్సి ఉంది. అయితే ఈ పక్రియ నామమాత్రమే. గ్రామసభలు మాదిరిగా ఓటర్లు సమావేశమై నీటి సంఘాల అధ్యక్షులను ఎన్నుకుంటారు. వీరు డీసీలను, పీసీలను ఎన్నుకుంటారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ తెలిపారు.

అంతిమయాత్రకు దారేదీ?

- శ్మశానవాటికలకు మార్గం కరువు
- పొలాల మధ్య నుంచే రాకపోకలతో అవస్థలు

టెక్కలి/ కోటబొమ్మాళి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా గ్రామాల్లో శ్మశానవాటికలకు వెళ్లేందుకు దారిలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతిమయాత్ర సమయంలో పొలాల మధ్య నుంచే మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. టెక్కలి మండలం రావివలస పంచాయతీ దామోదరపురంలో దళిత కుటుంబాలకు సంబంధించి శ్మశానవాటికకు రహదారి సౌకర్యం లేదు. దీంతో శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందగా.. ఆపసోపాలు పడుతూ ఆ మృతదేహాన్ని పొలాల మధ్య నుంచి శ్మశానవాటికకు తీసుకెళ్లారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. తమ సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికకు రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- కోటబొమ్మాళి మండలం కన్నేవలసలో కూడా శుక్రవారం ఇటువంటి పరిస్థితే ఎదురైంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం చనిపోగా.. మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు దారిలేకపోవడంతో పంట పొలాల మధ్య నుంచి వెళ్లారు. దహన సంస్కారాలు పూర్తిచేశారు. వర్షాకాలం, పంటల సమ యంలో శ్మశానవాటికకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యకు 'మార్గం' చూపాలని కోరుతున్నారు.




టెక్కలి : దామోదరపురంలో..



కోటబొమ్మాళి : కన్నేవలసలో పొలాల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్థులు

పరమశివుడు.. జ్యోతిస్వరూపం

- జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుక
- నదీ స్నానం ఆచరించి దీపారాధన
- బాహుదా నది వద్ద భక్తుల సందడి





బాహుదానదీలో దీపాలు విడిచి పెడుతున్న భక్తులు

ఇచ్ఛాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరమేశ్వరున్ని జ్యోతి స్వరూపంగా ఆరాధించి ఆయన అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందే పర్వదినమే కార్తీక పౌర్ణమి. ఇతర పౌర్ణిమలకు భిన్నంగా ఈ రోజున చంద్రుడి వెలుగులు మరింత ప్రకాశవంతంగా ఉంటాయి. హిందూ ధర్మ విశ్వాసాల ప్రకారం కార్తీక పౌర్ణమి రోజునే ఈశ్వరుడు త్రిపురాసురుడిని సంహరించాడని చెబుతారు. అందుకే దీన్ని త్రిపుర పౌర్ణమి అని కూడా అంటారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నదీ స్నానం, దానం, జపాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. కార్తీక పౌర్ణమి రోజు దేవతలు భువికి దిగి వచ్చి గంగా స్నానం ఆచరిస్తారని భక్తుల నమ్మకం. అందుకే కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు వేకువ జామున 3 గంటల నుంచే బాహుదా నది ఉత్తరయాణం వద్ద స్నానాలు ఆచరించారు. అరటి దవ్వలతో దీపాలు వెలిగించి నదిలో విడిచి పెట్టారు. అనంతరం నది ఒడ్డున పూజలు జరిపారు. బిందెలతో జలాలలను తీసుకెళ్లి నదీ తీరాన కొలువుదీరిన శ్రీ పాతాళ సిద్ధేశ్వర ఆలయంలో శివపార్వతులకు, లింగానికి జలాభిషేకం చేశారు. నదీ తీరాన పూజలతో పాటు మతాబులు కాల్చి వేడుకలు జరిపారు. ఈరోజున నదీస్నానం ఆచరించి దీపాలు నీటిలో విడిచి పెడితే గత జన్మ, ఈ జన్మలో చేసిన పాపాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు.

కోటివత్తులు ఒక్కటిగా చేసి జ్వాలా తోరణం..



బాలాత్రిపుర కాలభైరవ పీఠం వద్ద కోటి వత్తులతో..

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బలగ నాగావళి నది వద్ద వెలసిన శ్రీ బాలాత్రిపుర కాలభైరవ పీఠంలో శుక్రవారం మహాలక్ష్మీ దేవికి పూజలు నిర్వహించారు. శ్రీచక్రరూపేణ సిరి జ్యోతి పూజ చేశారు. అనంతరం కోటి వత్తులని ఏక ఒత్తుగా చేసి వెలిగించి జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. ఈ పూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా మొండేటివీధిలో ఉన్న శ్రీ లలితాదేవి సహిత శివకామేశ్వర ఆలయంలో పౌర్ణమి పూజలు, అభిషేకాలు చేశారు. జ్వాలాతోరణ ఉత్సవాన్ని నిర్వహించారు. నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరాలయంలో అర్చకులు బి.అశ్విని కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి జ్వాలాతోరణ ఉత్సవం జరిపారు. నేతితో జ్యోతుల వెలిగించి దీపారాధన నిర్వహించారు. ఉమారుద్ర కోటేశ్వరాలయంలో నాగావళి నది ఒడ్డున దీపారాధన కార్యక్రమాలు, జ్వాలాతోరణ ఉత్సవాలు జరిపారు.



ఉమాజఠలేశ్వరాలయం వద్ద..

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు

ఎచ్చెర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలం కుంచాలకురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో కార్తీక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరిగాయి. ఆశ్రమ పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులచే శ్రీ చక్రాల వద్ద పూజలు జరిపించారు.



శ్రీచక్రాలకు పూజలు చేస్తున్న భక్తులు

నంది వాహనంపై శ్రీముఖలింగేశ్వరుని విహారం



నంది వాహనంపై స్వామివారు..

జలుమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీ ముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం శుద్ధ పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి దర్శనం భక్తులకు కల్పించారు. సాయంత్రం ప్రధాన ఆలయం శిఖరంపై దీపం వెలిగించిన తర్వాత జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను నంది వాహనంపై ఆశీనులను చేసి గ్రామోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, సింహాచలం, వెంకటాచలం, దేవాదాయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.



దీపారాధన చేస్తున్న భక్తులు



కైలాసగిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కైలాసగిరి ప్రదక్షిణ

- ఘనంగా అఖండ దీపారాధన

జి.సిగడాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎందువ కైసలాసగిరి ప్రదక్షిణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో కోలాహలంగా సాగింది. ఉదయం ఐదు గంటలకు ఎందువ గ్రామంలో వెలసిన కైలాశేశ్వరుని ఆలయం వద్ద ప్రారంభమై 12 కిలోమీటర్ల మేర కైలా సగిరి ప్రదక్షిణ కొన సాగింది. శివ, అయ్య ప్ప దీక్షాపరులతో పాటు భక్తులు ఆలయ ప్రాంగణం నుంచి ఎందువ, నడిమివలస, శేతుభీమవరం, గెడ్డ కంచరాం మీదుగా కైలాసగిరి పర్వతం వద్దకు చేరుకున్నారు. శివనా మస్మరణతో ఆయాగ్రామాలు, ఆలయప్రాంగణం మార్మో గాయి. ఐదు గంటల పాటు చేసిన ప్రదక్షిణలో మూడువేల మంది భక్తులు పాల్గొన్నారు. దారి పొడవునా భక్తులకు మంచినీళ్లు, మజ్జిగను అందజేశారు. సాయంత్రం కైలాసగిరిపైన అఖండ దీపారాధనను అంగరం గవైభవంగా నిర్వహించారు.



అఖండ దీపారాధన చేస్తున్న భక్తులు

లిఫ్ట్ ఇస్తానని నమ్మించి..

(ఐదో పేజీ తరువాయి)

తన మూడేళ్ల చిన్నారితో కలిసి కన్నవారింటికి వెళ్లిపోయింది. అయితే వాయిదా సొమ్ము రికవరీ కోసం ఫైనాన్స్ సంస్థ నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి తరచూ డబ్బులు అడిగేవారు. ఈ క్రమంలో ఈ నెల 9న ఫోన్ చేసి డబ్బులు అడగ్గా.. తన కుమార్తె మెడలో ఉన్న బంగారం చైన్‌ను తాకట్టుపెట్టి ఇస్తానని.. శ్రీకాకుళం వెళ్తున్నానని వివాహిత చెప్పింది. ఈ మేరకు ఆమె తన కుమార్తెతో కలిసి పుట్టింటి నుంచి రాత్రి 7గంటలకు ఆటోలో శ్రీకాకుళంలో తన ఇంటికి బయలుదేరింది. చింతాడ జంక్షన్‌లో దిగి శ్రీకాకుళం వెళ్లే బస్సు, ఆటో కోసం ఎదురు చూస్తుండగా.. ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి లిఫ్ట్ ఇస్తానన్నాడు. ఆమె రానని చెప్పగా.. తమ్ముడిని నమ్మవా? అంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. ఓ వైపు చీకటి పడిపోవడం.. మరోవైపు చిన్నారి ఏడుస్తుండడంతో ఆమె ఆ వాహనం ఎక్కింది. కాగా కొత్తరోడ్డు దగ్గర గెడ్డ వైపు ఆమెను తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. పాపను, ఫోన్‌ను లాక్కుని.. మెడలో చైన్‌ను గెడ్డలో పడేస్తానని ఆమెను బెదిరించాడు. లొంగిపోవాలని.. లేదంటే ఆ చిన్నారిని గెడ్డలో విసిరేస్తానన్నాడు. పెనుగులాటలో చిన్నారికి కంటి వద్ద చిన్న గాయమైంది. అయితే వివాహిత ఎలాగోలా తప్పించుకుని అక్కడ నుంచి తమ చిన్నారితో కలిసి రోడ్డువైపు పరుగులు తీసింది. పరిస్థితి చేయిదాటిపోయిందని గమనించిన ఆ వ్యక్తి.. అక్కడి నుంచి పరారయ్యాడు.

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు....

బాధితురాలు 112 నెంబర్‌కు ఫోన్ చేసి.. అత్యాచార యత్నంపై ఫిర్యాదు చేసింది. పోలీసుల సూచన మేరకు ఆరోజు రాత్రి రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పడంతో మరుసటి రోజు 10న పెద్దపాడు పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. మరోవైపు వాయిదా డబ్బుల కోసం ఫైనాన్స్ వ్యక్తి పదేపదే ఫోన్ చేస్తున్న విషయాన్ని బాధితురాలు తన తల్లికి చెప్పింది. ట్రూకాలర్‌లో ఆ వ్యక్తి ఫోన్ నెంబర్ వెతకగా అత్యాచారానికి యత్నించిన వ్యక్తి ఫొటో కనిపించింది. దీంతో బాధితురాలు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఆ ఫోన్ నెంబర్ వంజంగి గ్రామానికి చెందిన తాండ్ర విద్యాసాగర్ పేరిట ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్ స్విచ్చాఫ్ కావడంతో నేరుగా విద్యాసాగర్ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. విద్యాసాగర్.. ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం గ్రామపెద్దలతో కలిసి విద్యాసాగర్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు విచారణ చేపట్టారు. ఆ సమయంలో విద్యాసాగర్‌ను చూడగానే మూడేళ్ల చిన్నారి.. అతడిని చూపిస్తూ తనను.. అమ్మను కొట్టాడంటూ పోలీసులు చెప్పింది. కాగా.. పోలీసుల సమక్షంలో ఈ కేసును రూ.1.50లక్షలకు రాజీ చేసేలా యత్నించారు. దీంతో మరుసటిరోజు ఆమె ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని ఆశ్రయించింది. ఆయన రూరల్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. హుటాహుటిన గురువారం రాత్రి కేసు నమోదు చేశారు.

- ఇదిలా ఉండగా తనపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిని శిక్షించాలని శుక్రవారం రూరల్ పోలీసుస్టేషన్ వద్ద బాధితులు ఆవేదన వ్యక్తం చేసింది. తొలుత రాజీ చేసేందుకు యత్నించిన పోలీసులు ఈ కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని కోరింది. ఈ విషయమై శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద వద్ద ప్రస్తావించగా వివాహితపై విద్యాసాగర్ అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించినట్టు ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేసి.. బాధితురాలికి న్యాయం చేస్తామని తెలిపారు.

ప్రజలకు మేలుచేసే బడ్జెట్ ఇది

- అసెంబ్లీలో ఎమ్మెల్యే గౌతు శిరీష



అసెంబ్లీలో బడ్జెట్‌పై మాట్లాడుతున్న గౌతు శిరీష

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల అరాచకపాలనలో నష్టపోయిన రాష్ట్ర ప్రజలకు ఉపసమనం కలిగించేలా బడ్జెట్ ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కొనియాడారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బడ్జెట్‌పై ధన్యవాదాలు తెలిపేందుకు శిరీషకు అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ పాలన బడ్జెట్‌లో అంకెలు మాత్రమే కనిపించాయని, ఆ సొమ్ము ఎక్కడికి వెళ్లిందో అర్థం కావడం లేదన్నారు. మన ఆస్తులే తాకట్టుపెట్టి మనకే సంక్షేమ పథకాలు ఇవ్వడం దురదృష్టకరమన్నారు. అమరావతి, నదుల అనుసంధానం, పోలవరం, పరిశ్రమల స్థాపనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని కొనియాడారు. విధ్వంసంతో ప్రారంభమైన వైసీపీ పాలన.. కష్టపూరిత చర్యలతో రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకెళ్లారని, గత ఐదేళ్ల పాలనకు మన ప్రభుత్వానికి ఎంతో తేడా ఉందన్నారు. బడ్జెట్ పై కళ్లుండి కనిపించకుండా మాట్లాడు తున్న వైసీపీ నాయకులు బేరీజు వేసుకోవాలని హితవు పలికారు. అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ వంటి పథకాల ద్వారా అర్హత ఉన్న రైతులకు ప్రయోజనం కలుగుతోందని, వ్యవసాయ పనిముట్లు, పొలంబడి వంటి పథకాలు అమలు చేస్తున్నామని, రబీ నుంచి పంటల బీమా కల్పిస్తున్నామని తెలిపారు. పాడిరైతుల కోసం పశుసంపద పెంచుతూ ఆదాయం కల్పిస్తున్నామని, చేపలపై ఆధారపడిన సాంప్రదాయ మత్స్యకారులకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ఆలుగడ్డకు.. ఉల్లిగడ్డకు తేడాతెలియని నాయకులు గతంలో అమలైన సంక్షేమం, అభివృద్ధిని చూసుకోవాలని హితవుపలికారు.

పల్లెపండగకు మెటీరియల్ గండం

- ఇంజనీరింగ్, మైన్స్ శాఖల మధ్య సమన్వయ లోపం
- టెక్కలిలో 202 పనులకు తొమ్మిది మాత్రమే పూర్తి

టెక్కలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పల్లెపండుగ పేరిట క్షేత్రస్థాయిలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించింది. అయితే ఈ పనులకు మెటీరియల్ గండం పొంచిఉంది. నిన్న, మొన్నటి వరకు ఇసుక సమస్య ఉండగా, నేడు దాని నుంచి గట్టెక్కినప్పటికీ ప్రస్తుతం 20ఎంఎం చిప్స్, 40ఎంఎం మెటల్, డస్ట్‌పౌడర్ మెటీరియల్ కోసం సంబంధిత వెండర్స్ ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రకాల మెటీరియల్ చిప్స్ క్రషర్స్ నుంచి తీసుకువెళ్లాలంటే ఒక యూనిట్‌కు సుమారు రూ.700 ఏఎంఆర్ సంస్థకు చెల్లించాల్సి వస్తుంది. అయితే చిప్స్, మెటల్, డస్ట్‌పౌడర్లు తీసుకువెళ్లేందుకు సైతం వెండర్స్ నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పర్యావరణ అనుమతులు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అనుమతులు ఉన్న క్రషర్ నుంచి మాత్రమే తీసుకువెళ్లాలని గనులశాఖ చెబుతుండడంతో వెండర్స్ ఆ పనులు చేసేందుకు వెనుకబడిపోతున్నారు. టెక్కలి పరిధిలో ఏడు వరకు చిప్స్ క్రషర్స్ ఉన్నప్పటికీ అందులో ఒక్కదానికి మాత్రమే పర్యావరణ అనుమతులు ఉన్నాయి. అక్కడి నుంచే మెటీరియల్ తీసుకువెళ్లాలని గనులుశాఖ ఇటీవల స్పష్టం చేసింది. ఫలితంగా టెక్కలి మండలంలో రూ.15 కోట్ల34లక్షల అంచనాతో 202 ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు పల్లెపండుగలో శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు రూ.41లక్షల అంచనా వ్యయంతో తొమ్మిది పనులు మాత్రమే పూర్తిచేశారు. మిగిలిన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడి మాదిరిగానే దాపరించింది. వెండర్స్ ఆయా రకాల మెటీరియల్ తీసుకున్నప్పుడు సంబంధిత ఏఎంఆర్ సంస్థకు ఆన్‌లైన్ బిల్లు కోరుతున్నారు. అయితే సదరు ఏఎంఆర్ సంస్థ ఇచ్చే బిల్లులో సీనరీస్ చార్జీలు అనే పదం ఉండడం లేదని పంచాయతీరాజ్‌శాఖ యంత్రాంగం గుర్తించింది. ఈ సమస్యను గట్టెక్కించేందుకు జిల్లా కలెక్టర్ రెండు రోజుల క్రితం మైన్స్, పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అయినా అటు పంచాయతీరాజ్, ఇటు మైన్స్ శాఖల మధ్య సమన్వయం కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉత్సాహంగా పల్లెపండుగ పనులు జరిపించాలని ప్రకటించినప్పటికీ ఆదిలోనే మెటీరియల్ గండంతో మోకాలడ్డినట్లయింది. ఈ విషయమై మైన్స్ ఏడీ విజయలక్ష్మి వద్ద ప్రస్తావించగా ఆథరైజ్‌డ్ క్వారీల నుంచి మాత్రమే మెటల్ తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇదే విషయమై పంచాయతీరాజ్ డీఈఈ పి.సుధాకర్ వద్ద ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా మెటీరియల్ సమస్య మూలంగా పనులు జాప్యమయ్యాయని, ఈ ఆర్థిక సంవత్సరంలోగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



టెక్కలి మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు జరుగుతున్న దృశ్యం (ఫైల్)

అప్పుడు హద్దుల్లేకుండా.. ఇప్పుడు అజ్ఞాతంలోకి..

(ఐదో పేజీ తరువాయి)

అందుతున్నాయి. ఇప్పటి వరకూ 13కు పైగా కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే గార మండలంలో నమోదైన కేసు వ్యవహారంలో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను శ్రీకాకుళం కోర్టులో హాజరుపరిచారు. అలాగే సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళీపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదైంది. సమాజం లో గౌరవ ప్రదమైన వ్యక్తులపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసానిపై చర్యలు తీసుకోవాలంటూ శ్రీకాకుళం పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ గురు వారం పాతపట్నం పోలీసుస్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. అలాగే టెక్కలిలో కూడా టీడీపీ నేతలు పోలీసుస్టేషన్‌లో పోసానిపై ఫిర్యాదు చేశారు.

హద్దులు మీరితే కేసులు.. ఆపై జైలు...

సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడితే వారిపై కేసు నమోదుతోపాటు జైలుకు కూడా పంపుతారు. సైబర్ నేరాల చట్టాల ప్రకారం ఫేస్ మార్ఫింగ్ చిత్రాలు, వీడియోలు వైరల్ చేసి ఇతరుల వ్యక్తిత్వ హననానికి పాల్పడితే 67 ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా కూడా విధిస్తారు. ప్రముఖ వ్యక్తుల పేరుతో పోస్టులు పెడితే 66 డీఐటీ యాక్ట్ నమోదు చేసి మూడేళ్ల జైలు, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారు. జుగుప్సాకరంగా ఉన్న చిత్రాలు వీడియో ఆన్‌లైన్‌లో వ్యాప్తి చేస్తే ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌గా పరిగణించి బీఎన్‌ఎస్ చట్టంలో 353(2) సెక్షన్ కింద కేసు నమోదవుతుంది. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఒక వ్యక్తి పరువుకు భంగం కలిగిస్తే బీఎస్‌ఎన్ చట్టంలోని 336(4) సెక్షన్ కింద కేసు పెడతారు. సమాజంలో సంఘాలు, సమూహాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే 356(2) సెక్షన్‌తోపాటు పరువునష్టం కేసులు నమోదు చేస్తారు.

- అసత్యాలు ప్రచారం చేయకూడదు. ఎదుటి వ్యక్తుల కుటుంబాలను ఉద్దేశించి దూషిస్తూ అసభ్యకరంగా పోస్టులు పెట్టకూడదు. వీటికి లైక్‌లు కొట్టడం ఇతరులకు ఫార్వర్డ్ చేయడం నేరం. కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చే పోస్టులు చేస్తే జైలుకు వెళ్లక తప్పదు. చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లే వారిపై కేసులు నమోదైతే పోలీసులు ఎన్‌ఓసీ ఇవ్వరు. ఇది లేకుంటే ఉద్యోగాలు రావు. ఒకసారి కేసు నమోదైతే ఆ వ్యక్తిపై నిరంతర నిఘా ఉంటుంది. పిల్లలు, తల్లిదండ్రులకు ఇబ్బందే. తప్పు చేసిన పిల్లలు దొరక్కపోతే తల్లిదండ్రులు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిందేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి

● ఆలయాల్లో దీపారాధన ● ఇళ్లల్లో ప్రత్యేక పూజలు ● గ్రామాల్లో నగర సంకీర్తన

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో భక్తులు పూజలు, భజన కాలక్షేపాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో హరేరామ హరే కృష్ణ నామసంకీర్తనతో గీతాలాపన చేపట్టారు. సాయంత్రం ఆలయాల్లో దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఇళ్ల వద్ద కేధారేశ్వరునికి పూజలు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నరసన్నపేట: భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో



పాతపట్నం: మహేంద్రతనయ నదీ తీరంలో



కవిటి: బొరివంకలో హరేరామ భక్త బృందం నగర సంకీర్తన

అటవీ భూములను డీ నోటిపై చేయాలి



రెవెన్యూ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గార మండలం మొగదాలపాడులో గల భూములు గతంలో అటవీ భూములుగా ప్రభుత్వ రికార్డు అయి ఉన్నాయని, వాటిని డీ-నోటిపై చేసి గ్రామస్థులను ఆదుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం అమరావతి సచివాలయంలోని రెవెన్యూ మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి, వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే అరసవల్లి శ్రీసూర్య నారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలను ప్రభుత్వ పండుగగా గుర్తించాలని కోరుతూ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎండోమెంట్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఐఈఐ ఏపీ కేంద్ర సభ్యుడిగా రాజశేఖర్



పొందూరు/ఎచ్చెర్ల, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ)కు ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర సభ్యుడిగా అంబేద్కర్ యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.చింతాడ రాజశేఖర్ ఎంపికయ్యారు. ఈయన పొందూరు మండలం గోకర్ణపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ఇటీవల ఏపీ రాష్ట్ర డివిజన్‌కు ఐఈఐ ఆన్‌లైన్ పోలింగ్ నిర్వహించింది. శుక్రవారం ఫలితాలు విడుదలకాగా రాజశేఖర్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఐఈఐ నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. నాలుగేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈనెల 30న విజయవాడలో జరగనున్న ఐఈఐ సర్వసభ్య సమావేశంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈసందర్భంగా గోకర్ణపల్లి సర్పంచ్ చింతాడ మాధురి, మాజీ ఎంపీటీసీ చింతాడ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

అండర్-12 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

ఇచ్ఛాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అండర్-12 జిల్లా క్రికెట్ ప్రాబుల్ జట్టుకు పట్టణానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం సురంగి రాజా మైదానంలో సీనియర్ క్రీడాకారులు అభినందించారు. ఈనెల 14న శ్రీకాకుళం స్టేడియంలో జిల్లా జట్టు ఎంపిక జరిగిందని ఈ ఎంపికల్లో ఐసీసీ అకాడమీకి చెందిన సాలిన సాయి, డిషోజ్ యాదవ్, సమితి గౌడో, దక్ష, ఓంప్రకాష్, మహేష్ ఎంపికయ్యారని కోచ్ డి.గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌తో పాటు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అపార్ నమోదుకు ఆధార్ సెంటర్లను వినియోగించుకోవాలి

ఆమదాలవలస, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): అపార్ నమోదులో పొరపాట్లను సరి చేసేందుకు ఆయా క్లస్టర్ల పరిధిలోని పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్లను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈవో రాజేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం కొర్లకోట హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఎంపీడీవో వెంకట్రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అక్కులపేట, దూసిపేట, తొగరాంలలో కూడా సెంటర్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

● జి.సిగడాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అపార్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రం, నడిమివలస గ్రామాల్లో ఏర్పాటుచేసిన అపార్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈయన వెంట ఎంఈవోలు ఎ.రవి, ముల్లు శ్రీనివాసరావు, డీపీ మీసాల రాము, వీఆర్వో నర్సింగరావు ఉన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని 108 వాహన ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీహరికి వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రస్తుతం నల్ల బాడ్జీలు ధరించి నిరవధిక సమ్మె చేస్తున్నామని చెప్పారు. ఈనెల 25నుంచి సమ్మెకు వెళ్తున్నట్టు తెలిపారు. 108 వాహన ఉద్యోగులు పాల్గొన్నారు.

బిర్సాముండాకు ఘన నివాళి



కవిటి: మాణిక్యపురంలో బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కవిటి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురం గ్రామంలో బిర్సా ముండా జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ పథకం కింద మాణిక్యపురం పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. గిరిజన సమాజానికి బిర్సా ముండా చేసిన సేవలను స్మరించారు. మండలంలో మాణిక్యపురం గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామసభను చేపట్టి రాబోవు రెండేళ్లలో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీ శివాజీ పాణిగ్రాహి, సర్పంచ్ లలితా సాహు పాల్గొన్నారు.

● గుజరాతీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాలలో శుక్రవారం జన జాతీయ గౌరవ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం, జాన్సీ అగ్రికల్చరల్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎన్‌వైకే కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, ఎస్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.ధర్మారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా ఈ జన జాతీయ గౌరవ్ దివస్‌ను చేసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి.జనార్ధనరావు, కె.నరేష్, సొసైటీ అధ్యక్షులు ఆర్.సుమతి మోహనరావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా మహా సభలను జయప్రదం చేయండి

రణస్థలం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న జిల్లా కళాసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న 5వ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని కళాసీ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శిలు బి.చిన్నారావు, కె.సూరయ్య కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రకృతి సాగుతో నేల సారవంతం

జి.సిగడాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగుతో నేల సారవంతం అవుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారిణి పి.రేవతి తెలిపారు. దవళపేట గ్రామంలో మాజీ సర్పంచ్ కంచరాన సూరన్నాయుడు సహకారంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వనరుల కేంద్రాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు.

కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సూర్యచంద్రరావు, మహిళా కళాశాల హిస్టరీ లెక్చరర్ చిన్నారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

భూముల లాగిన్ ఇవ్వండి

సోంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అగ్రహారం భూముల లాగిన్ ఇవ్వాలని కొర్లాం రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ బి.అప్పల స్వామికి వినతిపత్రం సమర్పించారు. గతంలో ఉన్న లాగిన్ ఇటీవల తొలగించార ని, వెంటనే లాగిన్ ఇప్పించాలని వారు కోరారు.

సిబ్బంది సంక్షేమానికే ప్రాధాన్యం: ఎస్పీ



పోలీసు సిబ్బందికి గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సంక్షేమానికే మొదటి ప్రాధాన్యం ఇస్తామని, వారి వృత్తి రీత్యా, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా పోలీస్ గ్రీవెన్స్ నిర్వహించారు. సిబ్బంది తమ సమస్యలను అవసరమైతే ఫోన్‌లో కూడా తెలియజేయచ్చని చెప్పారు.

దివ్యాంగులు ఎవ్వరికీ తీసిపోరు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎందులోను, ఎవ్వరికీ తీసిపోరని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. ప్రతి నెల మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం జడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా వినతుల స్వీకరణ కార్యక్రమం-స్వాభిమాన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 14 వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. డీఆర్వో వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు, దివ్యాంగుల శాఖ ఏడీ కె.కవిత, డీసీహెచ్ఎస్ డా.కళ్యాణబాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్, పర్యాటకాధికారి నారాయణరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఐసీడీఎస్, డ్వామా, గృహ నిర్మాణ సంస్థ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదనపు వసూళ్లు చేస్తే కేంద్రం రద్దు

● గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు డీఎస్‌వో హెచ్చరిక

పొందూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్యాస్ పంపిణీ సమయంలో బిల్లులో ఉన్నదాని కంటే అదనపు వసూళ్లు చేస్తే చర్యలు తీసుకోవడమే కాకుండా గ్యాస్ ఏజెన్సీని రద్దు చేస్తామని జిల్లా సివిల్ సప్లయి అధికారి జి.సత్యనారాయణ హెచ్చరించారు. మండల కేంద్రం, రాపాక కూడలిలోని సింహాద్రి ఇండేన్ గ్యాస్ ఏజన్సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాజీ ఎంపీటీసీ కె.సాయికుమార్ గ్యాస్ ఇంటింటికీ పంపిణీ సమయంలో రూ.30 కంటే అదనంగా వసూళ్లు చేస్తున్నారని డీఎస్‌వో దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ తతంగం ఎంతో కాలంగా జరుగుతోందని చర్యలు తీసుకోవాలని కోరారు. గ్యాస్ డోర్ డెలివరీ సిబ్బంది వసూళ్లకు పాల్పడితే గ్యాస్ ఏజన్సీ మేనేజ్‌మెంట్ బాధ్యత తీసుకోవాలని నిర్వాహకురాలు సరోజినికి సూచించారు. డీఎస్‌వో తోపాటు తహసీల్దార్ వెంకట రామానుజులు ఉన్నారు.

చిన్న సాగునీటి వనరులపై దృష్టి సారించండి

కంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన్న సాగునీటి వనరుల అభివృద్ధి, గొలుసుకట్టు చెరువుల పునర్నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించాలని రైతు కులం నాయకులు, వంశధార జల సాధన కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం కంచిలి మార్కెట్ కమిటీ యార్డు వద్ద రైతు కులం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సాధన కమిటీ కన్వీనర్ ప్రధాన శివాజీ మాట్లాడారు. చిన్న సాగునీటి వనరుల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లోని గొలుసుకట్టు చెరువుల పునర్నిర్మాణం చేయాలని తీర్మానించారు. రైతులు రెండో పంటగా కాయగూరలు పండించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ సాగు, తాగునీటి వనరుల అభివృద్ధికి చేయూత అందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, రిటైర్డు డిఎస్పీ శమళ్ళ ప్రసాద్, ఎంపీపీ దేవదాస్ రెడ్డి, బి.కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు ఎస్ఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న ఏడుగురు ఎస్ఐలకు శుక్రవా రం రాత్రి స్థానచలనం అయ్యింది. విజయ నగరం జిల్లా ట్రాఫిక్ ఎస్ఐ వాసంశెట్టి లోవరాజును సోంపేట, విజయనగరం ఒన్‌టౌన్ ఎస్ఐ శ్రీరామ్ హరిబాబును బారువ, బారువ ఎస్ఐ లోకవరపు చంద్రశేఖర్‌ను విజయనగరం వీఆర్‌కు, సోంపేట ఎస్ఐ బి.హైమావతిని వీఆర్ శ్రీకాకుళంకు, కవిటి పీఎస్ (అటాచ్‌డ్ ఉమెన్ పీఎస్)ఎస్ఐని టెక్కలి-1 ఎస్ఐగా, శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న చామంతుల రా మారావును డీపీటీసీ శ్రీకాకుళం (అటాచ్‌డ్ టు టాస్క్ ఫోర్స్)కి, శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న గేదెల వాసుదేవరావును విజయ నగరం వీఆర్‌కు, డీపీటీసీ (అటాచ్‌డ్ టూ టాస్క్ ఫోర్స్)లో ఉన్న టి.రాజేష్‌ను కా శీబుగ్గ-1 ఎస్ఐగా, కంచిలి ఎస్ఐ జి.రాజేష్ ను శ్రీకాకుళం వీఆర్‌కు బదిలీ చేశారు.

కేసులు ఎత్తివేతపై హర్షం

గుజరాతీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులపై కేసులను ఎత్తివేస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ప్రకటించడంపై ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. విజయవాడలో 2022 సెప్టెంబరు ఒకటిన చలో విజయవాడ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులపై కేసులు పెట్టారు. ఈ కేసులను ఎత్తివేస్తున్నట్టు లోకేశ్ ప్రకటించడం పట్ల ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబజీ పఠాన్, కె.రాజేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

లావేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు చాట్ల రమణ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. శుక్రవారం అమరావతిలో నారా లోకేశ్‌ని కలిసి, బీసీల స్థితిగతులను వివరించినట్టు తెలిపారు. ఉత్తరాంధ్రలో వెనుకబడిన బీసీలందరికీ ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, తక్షణమే డీఎస్సీ నిర్వహించాలని, బీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించాలని, పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని లోకేశ్‌ను కోరినట్లు రమణ తెలిపారు.

జాతీయ సాహస శిబిరానికి బీఆర్‌ఏయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఎచ్చెర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మనాలి (హిమాచల ప్రదేశ్)లో అటల్ బిహారీ వాజ్‌పేయి మానటరింగ్ అండ్ ఏలైడ్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో ఈనెల 20 నుంచి జరగనున్న ఎన్ఎస్ఎస్ జాతీయ సాహస శిబిరంలో పాల్గొనేందుకు డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ విద్యార్థుల బృందాన్ని ఎంపిక చేశారు. బీఆర్‌ఏయూ నుంచి 8 మంది, సూర్యతేజ డిగ్రీ కళాశాల(పలాస)కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనున్నారు. ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు కొనసాగనున్న ఈ శిబిరంలో పాల్గొనేందుకు వర్సిటీ విద్యార్థులు శనివారం బయలుదేరనున్నారు. వర్సిటీ వీసీ కేఆర్ రజని, రెక్టార్ బి.అడ్డయ్య, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సి పాల్ డా.ఎం.అనూరాధ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డా.డి. వనజ ఈ బృందాన్ని అభినందించారు. ఎన్ఎస్ఎస్ పీవో డా.కె.కరుణానిధి పర్యవేక్షణలో ఈ బృందం సాహస శిబిరంలో పాల్గోనుంది.

డిగ్రీ కళాశాల పరిశీలన

పొందూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పూర్తి స్థాయిలో విధులకు హాజరు కాకపోవడంపై పట్టణ వాసులు, విద్యార్థులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆయన పరిస్థితిని సమీక్షించాలని టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్ అన్నెపు రాములకు సూచించారు. దీంతో వారు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు కళాశాలను సందర్శించారు. ఆ సమయంలో కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. కానీ హాజరు పట్టికలో 11 మంది సంతకాలు చేసి ఉన్నట్టు వారు గుర్తించారు. ప్రిన్సిపాల్ ఉదయలక్ష్మికి ఫోన్ చేయగా, తాను సెలవులో ఉన్నట్టు తెలిపారు. కళాశాలలో ఎటువంటి సైన్స్ ల్యాబ్ లేకపోయినా నలుగురు సిబ్బంది ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ఎమ్మెల్యేకు సమాచారం ఇస్తామని అన్నెపు రాము తెలిపారు.

సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి



రక్తదానం చేస్తున్న ఎన్‌ఏసీఎల్ సిబ్బంది

ఎచ్చెర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (శ్రీకాకుళం) బి.రాంబాబు అన్నారు. అరిణాం అక్కివలసలో గల నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమలో పరిశ్రమ వ్యవస్థాపకుడు కేవీకే రాజు జయంతి సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. పరిశ్రమలు సామాజిక బాధ్యతా కార్యక్రమాలు నిర్వర్తించాలన్నారు. ఎన్‌ఏసీఎల్ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ బి.కరుణశ్రీ, ఏఈ ఇ.సూర్యకళ, జీఎం కె.శ్యామప్రసాద్, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, పరిశ్రమ హెచ్‌పీడీ విభాగం, సిబ్బంది పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

శానిటరీ మేస్త్రీలను
విధుల్లో తీసుకోవాలి

● మోకాళ్లపై మున్సిపల్ కార్మికుల నిరసన

శ్రీకాకుళం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తొలగించిన శానిటరీ మేస్త్రీలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట మూడో రోజు సమ్మెలో భాగంగా శుక్రవారం మోకాళ్లపై కూర్చొని చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. అనంతరం డీసీఎల్‌కి వినతిపత్రం అందించారు. ఈ సమ్మెలో మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాలరావు డిమాండ్ చేశారు.



రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు


విజేతలుగా తిరిగి రండి

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్న జిల్లా జట్టు విజయంతో తిరిగి రావాలని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను తెలిపారు. ఈ మేరకు జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు శుక్రవారం పయనమయ్యింది. ఈ మేరకు నగరంలోని టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వారిని అభినందించారు. క్రీడాకారులంతా విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌వర్మ, కోచ్‌లు గౌతమ్, రాహుల్ పాల్గొన్నారు.

వీటిని ఫౌంటైన్లంటారా?

● నిర్వహణ లేక దారుణంగా తయారై.. ● దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్న వైనం

పలాస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్రాలను చూస్తున్నారుగా.. ఒకప్పుడు పలాస-కాశీబుగ్గ పట్టణం లో ప్రజలకు ఆహ్లాదం కలిగించిన వాటర్ ఫౌంటైన్లు.. ప్రధాన కూడళ్లలో గతంలో ఏర్పా టు చేసిన ఫౌంటైన్ల నిర్వహణలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర క్ష్యం వహించింది. దీంతో ఇవి మూలకు చేరడంతో పాటు వాటిలో పడిన వర్షపు నీరు నిలిచిపోయి దారుణంగా త యారయ్యాయి. వీటిలో దోమ లు ఉత్పత్తి చెందడంతో వ్యాదులు ప్రబలుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పా టు చేసిన ఈ ఫౌంటైన్లు ప్ర స్తుతం నిరుపయో గంగా ఉండడంతో పట్టణ వాసుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ప్రధానంగా జీడి పండు సెంటర్, కాశీబుగ్గ బస్టాండు వద్ద రాజీవ్ గాంధీ విగ్రహం, మునిసిపల్ కార్యాలయం ఎదురుగా తదితర ప్రాంతా ల్లోని ఫౌంటైన్లను ప్రథమ పాలకవర్గం హయాంలో రూ.20 లక్షల వరకు వ్యయం చేసి ఏర్పాటు చేశారు. ఆ తరువాత వీటి నిర్వహణపై అధికారులు, పాలకులు అశ్రద్ధ వల్ల దయనీయ స్థితిలో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నాలుగు సింహాల బొమ్మల వద్ద..



జీడి పండు బొమ్మ వద్ద ఇలా..



రాజీవ్‌గాంధీ జంక్షన్ వద్ద ఫౌంటైన్..

క్రైం కార్నర్

పేపర్ ప్లేట్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

● రూ.10 లక్షల విలువైన యంత్రాలు దగ్ధం

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక లేబర్ కాలనీలో టంకాల సునీల్‌కు చెందిన పేపర్ ప్లేట్ తయారీ పరిశ్రమలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.10 లక్షల విలువైన రెండు పేపర్ ప్లేట్ యంత్రాలతో పాటు ముడిసరకు ఆహుతైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపకశాఖ అధికారులు భావిస్తున్నారు. సకాలం లో సిబ్బంది చేరుకొని మంటలు వ్యాపించకుండా గట్టి చర్యలు తీసుకు న్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పరిశ్రమలో యంత్రాలన్నీ దగ్ధం కావడంతో ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



పేపర్ బండిల్‌ను బయటకు తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అతిగా మద్యం తాగి యువకుడి మృతి

● మృతుడిది పోలాకి మండలం జిల్లేడివలస



శ్రీనివాసరావు (ఫైల్)

నరసన్నపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) స్థానిక పల్లిపేట జంక్షన్ వద్ద ఉన్న ఎస్‌వీసీటీ జ్యూట్ శిక్షణ కేంద్ర భవనంపై పోలాకి మండలం జిల్లేడివలసకి చెందిన లబ్బ శ్రీనివాసరావు (32) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసరావు ఈనెల 13న బంధువుల ఇంటికి గుండువలస వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, ఆయన ఆచూకీ కోసం రెండు రోజులుగా వెతికినా లభించలేదన్నారు. అయితే పల్లిపేట జంక్షన్ సమీపంలో మేడపై విగతజీవిగా పడి ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో అక్కడికి వెళ్లి గుర్తించామని తల్లి జయమ్మ తెలిపింది. మద్యం పూటుగా సేవించడంతో మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

బావిలో పడి కార్మికుడు..



వీరాస్వామి(ఫైల్)

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక రెల్లివీధిలో బావిలో పడి బ్యాకరీ పరిశ్రమలో పనిచేస్తున్న దున్న వీరాస్వామి (52)శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇచ్ఛాపురానికి చెందిన వీరాస్వామి కొద్దిరోజుల కిందట స్థానికంగా మధు బ్యాకరీలో పనిచేసేందుకు వచ్చాడు. మద్యం అలవాటు ఉన్న ఈతడు బావి వద్దకు రాగా ప్రమాదవశాత్తు తూలి బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసు కున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది, కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని అతి కష్టమ్మీద బయటకు తీశారు. మృతుడికి భార్య రాజు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రరావు తెలిపారు.

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌తో డైరెక్టర్ల భేటీ

వజ్రపుకొత్తూరు, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావును నూతనంగా నియమితు లైన డైరెక్టర్లు పుచ్చ ఈశ్వ రరావు, కుత్తుమ లక్ష్మణ రావు శుక్ర వారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు విజయవాడ అయ్యప్పనగర్‌లో అగ్నికుల క్షత్రియ సామాజిక భవన ప్రారంభోత్సవంలో పాల్గొని చైర్మన్‌తో సామాజికవర్గ సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చించినట్లు పుచ్చ ఈశ్వర రావు తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ తదితరులున్నారు.



అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాపారావును సత్కరిస్తున్న పుచ్చ ఈశ్వరరావు తదితరులు

'స్మార్ట్ మీటర్ల పేరుతో భారం తగదు'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

టెక్కలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల పేరుతో వినియోగదారులపై భారంవేయడం తగదని సీపీఎం నాయకుడు నంబూరు షణ్ముఖరావు అన్నారు. శుక్రవారం ప్రజాపోరులో భాగంగా తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై భారాలు వేస్తోందని ఆరోపించారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీఎన్‌పీఎస్ నాయకుడు బెలమర ప్రభాకర్, సహచట్టం ప్రతినిధి అనపాన షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు, ధనుంజయ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత బిర్సా ముండా

జలుమూరు, నవంబరు 15: (ఆంధ్రజ్యోతి) ఆదివాసీల సమస్యలపై బిర్సాముండా చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమని, ఇవి నేటి యువతకు స్ఫూర్తి అని తహసీల్దార్ జన్ని రామారావు అన్నారు. ఎస్టీ మాకివలస లో ఆది వాసీ స్వాతంత్ర్యసమరయోధుడు బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజానీకాన్నిచైతన్యం చేసి పోరాడిన గొప్ప యోధుడు బిర్సాముండా అని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. భూస్వాములు గిరిజనుల భూములను ఆక్రమించి అనేక దురాగతాలకు పాల్పడుతున్న రోజుల్లో బిర్సా ముండా నాటి సామాజిక, ఆర్థిక అన్యాయాన్ని ఎదిరించి పోరాడిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, ఆర్‌ఐ కిరణ్, మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, వీఆర్వో ఎస్.రామారావు, గిరిజన సంఘ నేతలు పాపారావు, సూరన్నాయుడు పాల్గొన్నారు.



బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్ రామారావు, గిరిజన సంఘ నేతలు

పంచాయతీల అభివృద్ధికి చర్యలు

పలాసరూరల్,నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మెరుగైన పనితీరుతో గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వసంత్‌కుమార్ అన్నారు. లొత్తూరు గిరిజన గ్రామంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా జనజాతీయగౌరవ దివస్ నిర్వహించారు. అటవీ హక్కుల రక్షణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యం, విద్య, పర్యావరణ సంరక్షణతో పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలన్నారు. స్వాతంత్ర్య సమరంలో బిర్సాముండా చేసిన త్యాగాన్ని వివరిస్తూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.వైకుంఠరావు, సర్పంచ్ సవర పద్మ, కార్యదర్శి సద్గుణబాబు పాల్గొన్నారు.



పలాస రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో

భీంపురంలో జనజాతీయ గౌరవ దివస్

టెక్కలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా భీంపురం, జీడిపేట గిరిజన గ్రామాల్లో శుక్రవారం జనజాతీయ గౌరవ దివస్‌ను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీవో బగాది ప్రసాదరావు మాట్లాడుతూ.. గిరిజన సమస్య లపై పోరాడిన యోధుడు బిర్సాముండా అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సింహాద్రి, ఏపీఎం ఉమారాణి, కార్యదర్శి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: ప్రతిజ్ఞ చేస్తున్న గిరిజనులు

డిప్యూటీ స్పీకర్‌కు ఎంజీఆర్ అభినందన

పాతపట్నం నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన రఘురామ కృష్ణంరాజును శుక్రవారం పాత పట్నం ఎమ్మెల్యే ఎం.గోవిందరావు కలిసి అభి నందించారు. డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవడంపై హర్షం వ్యక్తంచేస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

'అపార్' పూర్తి చేయాలి

హిరమండలం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): అపార్ నమోదు ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. శుక్రవారం మూడు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఆధార్‌లో పిల్లల వివరాలు తప్పుగా ఉంటే వాటిని సరిచేసుకోవాలన్నారు.

'అపార్' నిబంధనలు సడలించాలి



ఎంపీడీవోతో మాట్లాడుతున్న సంఘ నేతలు

పోలాకి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వివరాలను నమోదు చేసే అపార్ ప్రక్రియలో నిబంధనలను సడలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు మెట్ట జనార్దనరావు, ఇలపండ రామారావు, హనుమంతు నిరంజన్‌రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందించారు. సమస్యలను తెలుసుకున్న ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్ సమావేశాల్లో అపార్ వివరాల నమోదు వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నారని, ఈ మేరకు చేయక తప్పదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి

● ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. ఫిర్యాదులను చట్టపరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. సివిల్, కుటుంబ తగాదాలు, మిస్సింగ్, పాత ఫిర్యాదులు కలిపి మొత్తం 9 వచ్చాయి. దీనిపై చర్యలకు పోలీసులకు ఆదేశించారు.



బాధితుడి నుంచి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ

మాదక ద్రవ్యాలతో భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దు

హిరమండలం,నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు సేవించి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకో వద్దని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం భగీరథపురం కాలనీలో 'సంకల్ప్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే అనర్థాలను వివరించారు. మాదక ద్రవ్యాలు యువతను పట్టి పీడిస్తున్నాయన్నారు. మాదక ద్రవ్యాలు వాడినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలు, సైబర్ నేరాలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కలిగించారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్

మాదకద్రవ్యాల వినియోగం నేరం

టెక్కలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం నేరమని, దీనికి దూరంగా ఉండాలని సీఐ కె.విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో అవగాహనా కార్యక్రమం సంకల్ప్‌ను నిర్వహించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, సైబర్‌క్రైమ్‌ల నివారణకు సహకరించాలని కోరారు. విద్యార్థి దశలో యువత చెడు ప్రవర్తన వైపు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

న్యూస్ బాక్స్

మహాసభలను జయప్రదం చేయండి

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నియోజకవర్గ కార్యదర్శి ఈ.గుణశేఖర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ మహాసభల్లో విద్యారంగ సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సృజన, వెంకటేష్, పాల్గొన్నారు.

హుద్‌హుద్ ఇళ్లపై దర్యాప్తు చేయించండి

టెక్కలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అనర్హులకు హుద్‌హుద్ ఇళ్లు ఇచ్చిందని, వీటిని దర్యాప్తు చేపట్టాలని బీజేపీ నాయకుడు హను మంతు ఉదయ భాస్కర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో రషీద్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. టీడీపీ హయాంలో కంకరబంద ప్రాంతంలో 191 ఇళ్ల కోసం అప్పట్లో పారదర్శకంగా లబ్ధిదా రుల ఎంపిక చేపడితే ఆ జాబితాను వైసీపీ నాయకులు పక్కకు తప్పించి నిబంధనలు తుంగలోకి తొక్కి అనర్హులకు అవకాశం కల్పించారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సాయిబాబా పాల్గొన్నారు.

భగవన్నామ స్మరణతో ప్రశాంతత

కోటబొమ్మాళి, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): భగవన్నామస్మరణతో ప్రశాంతత లభిస్తుందని పొందూరుకు చెందిన గీతానంద స్వామి, టెక్కలికి చెందిన నర్సింహ స్వామి అన్నారు. శుక్రవారం ఊడికలపాడు శ్రీరామమందిరం లో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తిమార్గం ముక్తికి సోపానమన్నారు. రామాయణ, భారత, భగవద్గీతల నుంచి పలు అంశాలను వివరించారు. కోటబొమ్మాళి ఆర్య సమాజం వారిచే గాయత్రీ మహా యజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ గీతాశ్రమం నిర్వాహకుడు సనపల కరుణ్‌కుమార్, కొమనాపల్లి చిన్నబాబు,గురువెల్లి అప్పమ్మ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వైసీపీ నేతలు

కొత్తూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిపల్లి తది తర గ్రామాల నుంచి సుమారు 50 వైసీపీ కుటుంబాలు శుక్రవారం బీజేపీలో చేరాయి. బీజేపీ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సవర నాగేశ్వ రరావు, తోయిక ఆనందరావు, సవర శంకరరావు, అప్పారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

కాళింగ సామాజికవర్గ సంక్షేమానికి కృషి

హరిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాళింగ సామాజికవర్గ సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. నూతనంగా డైరెక్టర్‌గా నియమితులైన ఆయన స్వగ్రామం బాలిగాంలో గ్రామస్థులు పౌర సన్మానం చేశారు. వక్తలు మాట్లాడుతూ.. టీడీపీ పార్టీలో అంచె లంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర స్థాయిలో పదవీ చేపట్టి గ్రామానికి పేరు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తలగాన చంద్రశేఖర్, వల్ల హరికృష్ణ, బొంగి వెంకయ్య, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

పంటలను సంరక్షించాలి

పలాసరూరల్,నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): గిరిజనులు పండించిన వరి పంటను సంరక్షించి ప్రజలకు అందించాల్సిన సమయం ఆసన్నమైందని హిమగిరి హెర్మన్‌గ్రేస్ చర్చి బిషప్ సుందర్ అన్నారు. హిమగిరి గ్రామంలో కోతల పండగను శుక్రవారం నిర్వహించారు. అంతకుముందు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్లు జాన్ అప్పారావు, ఎస్.జగన్నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గుల్లవానిపేటలో సంకల్ప్

పోలాకి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గుల్లవానిపేటలో శుక్రవారం పోలీసులు సంకల్ప్ సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. బడికి పోయే విద్యార్థులు అనవసరంగా దారి మధ్యలో నిరీక్షించరాదన్నారు. పాఠశాల విడిచిపెట్టిన వెంటనే బాలికలు నేరుగా ఇంటికి రావాలన్నారు. సాగరతీరంలలో అనుమానిత వ్యక్తులు తారసపడితే తమకు తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనరావు, గ్రామపెద్దలు, మత్స్యకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎనీటైమ్ మూత

● ఇబ్బంది పడుతున్న వినియోగదారులు



పెట్రోల్ బంకు వద్ద షట్టర్ దించేసిన ఎస్‌బీఐ ఏటీఎం

నరసన్నపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాలు తరచూ మూసివేస్తుండడం, మెషీన్లు పనిచేయక పోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 20 రోజులుగా ఏటీఎంలు పనిచేయడం లేదు. ఆన్‌లైన్, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పేలపై అవగాహన లేనివారు ఏటీఎంలను వినియోగిస్తున్నారు. అయితే అత్యవసర సమయాల్లో ఇవి పనిచేయకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పట్టణంలో ఎస్‌బీఐ ప్రధానశాఖ, బజారు శాఖ ఉన్నాయి. వీటి పరిధిలో మెయిన్ రోడ్డుపై మూడు, మార్కెట్‌లో ఒక ఏటీఎం ఉన్నాయి. స్థానికంగా ఓ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న కేంద్రం 20 రోజులుగా షట్టర్లను దించేశారు. బజారులో ఉన్న ఏటీ ఎం మెషీన్ గత కొన్ని రోజులుగా పనిచేయక పోవడంతో ఖాతాదారులు అనేక రీతులా ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎంలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు.



పాతబస్టాండ్‌లో పనిచేయని ఏటీఎం ఇది..

కొనసాగుతున్న గురుకుల బాలికల క్రీడా పోటీలు

ఎచ్చెర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో జోన్-1 క్రీడల పోటీలు కొనసా గుతున్నాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలు గురువారం ప్రారంభం కాగా, శుక్రవారం కూడా కొనసాగాయి. ఉమ్మడి మూడు జిల్లాల నుంచి 21 గురుకులాల నుంచి వచ్చిన విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ విభాగాల్లో తలపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ సమన్వయకర్త ఎస్. బాలాజీ నాయక్, ఎచ్చెర్ల, కొల్లివలస గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఎస్.పద్మజ, డి.దేవేంద్రరావు, ఎచ్చెర్ల వైస్ ప్రిన్సిపాల్ జ్యోతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

17న జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్ నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని శాంతినగర్ కాలనీలోగల జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 17వ తేదీన జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్ స్విమ్మింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు వై.సూర్యారావు, కార్యదర్శి జాన్సీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపికలు ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభం అవుతాయని చెప్పారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇందులో ఎంపికైన వారు డిసెంబరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ఏపీ బ్యాడ్మింటన్ టీమ్ మేనేజర్‌గా రాజు



శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ బ్యాడ్మింటన్ జట్టు మేనేజర్‌గా సబ్ రిజిస్ట్రార్ గురుగుబెల్లి రాజు నియమితులైనట్టు ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందా యి. ఒడిశా వేదికగా ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న ఆలిండియా జూనియర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా రాజు వ్యవహరిస్తారు. నియామకం పట్ల జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు కె.సాగర్, కార్యదర్శి ఎం.అశోక్, చీఫ్ ప్యాట్రన్ జి.సోమేశ్వరరావు, సీఈవో ఎస్.సూరిబాబు, జి.ప్రసాద్ తదితరులు అభినందించారు.